సాక్షి
తిరుపతి
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,700
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,332
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,800
రిటైల్ వెండి గ్రాము	రూ.73.80

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	21
చిత్తూరు	31	20
తిరుమల	27	16
గూడూరు	32	23
నగరి	32	22



ఆర్‌బీకేల పనితీరు భేష్

శ్రీకాళహస్తి: రైతుభరోసా కేంద్రాల పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర పశుసంవర్ధకశాఖ కార్యదర్శి రాజేష్‌కుమార్‌సింగ్ ప్రశంసించారు. బుధవారం ఆయన అమ్మపాళెం ఆర్‌బీకేని సందర్శించారు.

న్యూస్‌రీల్

శాప్ జిల్లా చీఫ్ కోచ్‌గా సయ్యద్ సాహెబ్



తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా చీఫ్ కోచ్‌గా శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏఓ షేక్ సయ్యద్ సాహెబ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఉత్తర్వులు జారీచేసింది. ఇదివరకు జిల్లా చీఫ్ కోచ్‌గా పనిచేసిన సీనియర్ క్రికెట్ కోచ్ ఎంఎస్ ఉమాశంకర్ మంగళవారం పదవీ విరమణ పొందడంతో సయ్యద్ సాహెబ్‌కు జిల్లా చీఫ్ కోచ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ప్రత్యేక ప్రణాళిక



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన వైద్యాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు వారంలోపు క్యాన్సర్ గుర్తించే పరీక్షలకు సచివాలయ స్థాయి నుంచి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఎక్కువ కేసులు నమోదైన మండలాలకు అధిక ప్రాధాన్యతన కల్పించి, బాధితులకు చికిత్సలందించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ హర్షవర్ధన్, స్విమ్స్ అంకాలజీ డాక్టర్ జయచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీలో కాల్ డ్రైవర్లకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో కాల్ డ్రైవర్లుగా (రోజు వారీ వేతనం ప్రాతిపదికన) పనిచేయడానికి ఆసక్తి గల వారు తిరుపతి డీఎంను సంప్రదించాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తయినవారే అర్హులన్నారు. వివరాలకు 9959225670 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు



తమ్ముడు, చెల్లెలికి భోజనం తిని పిస్తున్న ప్రతిజ్ఞ

అమ్మానాన్నను మరిపిస్తూ.. అనురాగం కురిపిస్తూ..

విధి విసిరిన సవాల్‌కు బెదర లేదు.. ప్రకృతి ప్రకోపానికి భయపడలేదు.. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా కుంగిపోలేదు. తల్లిదండ్రులు చెంతలేరని చింతించలేదు. కన్నవారు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. పట్టుమని పదేళ్లు కూడా లేని తోబుట్టువులకు అన్నీ తానై ఆప్యాయతలు కురిపిస్తోంది. అమ్మలా లాలిస్తూ.. నాన్నలా అనురాగాన్ని పంచుతూ.. తనూ చదువుకుంటూ పసిహృదయాలకు కొండంత అండగా నిలుస్తోంది. అమ్మచేత గోరుముద్దలు తింటూ.. చందమామ కథలు వింటూ హాయిగా గడపాల్సిన వయసులోకుటుంబ బరువు, బాధ్యతలు మోస్తూ శభాష్ అనిపించుకుంటోంది. తల్లిదండ్రులు పక్క రాష్ట్రంలో కూలి పనులు చేస్తుండగా విధిలేని పరిస్థితుల్లో ఏడాదిన్నరగా చెల్లితమ్ముడితో కలిసి మొక్కవోని ధైర్యంతో ముందడుగు వేస్తున్న తీరు పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.
ఆ చిట్టితల్లి జీవన స్థితిగతులపై'సాక్షి' స్పెషల్ ఫోకస్..

సాక్షి ఫోకస్

- కుటుంబాన్ని కష్టాల్లోకి నెట్టిన కరోనా
- అప్పు తీరక హైదరాబాద్‌లోనే తల్లిదండ్రులు
- చెల్లి, తమ్ముడి బాధ్యత నెత్తికెత్తుకున్న చిట్టితల్లి
- చదువుకుంటూ.. తోబుట్టువులను చదివిస్తున్న చిన్నారి
- అండగా నిలుస్తున్న ప్రభుత్వ పథకాలు

నగరి: మండలంలోని ముడిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన సాగర్, సెల్వి దంపతుల కుమార్తె ప్రతిజ్ఞ (12) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. బాలిక తమ్ముడు సుదీప్‌కుమార్ (7) 2వ తరగతి, చెల్లెలు మధుర (4) అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్నారు. వీరు ముగ్గురూ ఏడాదిన్నరగా ముడిపల్లె ఎస్టీ కాలనీలో ఓ గుట్టపై ఉన్న చిన్న ఇంట్లో నివాసముంటున్నారు.

అమ్మలాంటి అక్క

ప్రస్తుతం ఈ కుటుంబ పెద్ద దిక్కు ప్రతిజ్ఞ. ఉదయం ఐదింటికే నిద్రలేచింది మొదలు పడుకునేవరకు తమ్ముడు, చెల్లి ఆలనాపాలనా చూస్తోంది. ఇల్లూవాకిలీ శుభ్రం చేయడం.. పాత్రలు కడిగి తెలిసిన వరకు వంట చేయడం.. వేడినీళ్లు కాగబెట్టి తమ్ముడు, చెల్లికి స్నానాలు చేయించడం.. పౌడర్ కొట్టి అందంగా ముస్తాబు చేసి బడికి తీసుకెళుతోంది. సాయంత్రం బడి నుంచి వచ్చిన వెంటనే మళ్లీ ఇంటి పని చేసుకుని.. తోబుట్టువులతో హోంవర్క్ పూర్తి చేయించడమే కాకుండా.. తానూ చక్కగా చదువుకుంటోంది,

బాధ్యతలన్నీ తనపైనే

ఇంట్లో సరుకులు తెచ్చుకోవాలన్నా.. కొత్తదుస్తులు కొనాలన్నా.. పండుగపబ్బాలకు ఏవైనా తీసుకురావాలన్నా.. అన్నీ తానై వ్యవహరిస్తోంది ప్రతిజ్ఞ. తన అత్తతో కలిసి ఐదు కిలోమీటర్ల దూరంలోని నగరి వారపు సంతకు వెళ్లి కూరగాయలు తెచ్చుకుంటోంది. తోబుట్టువులకు ఆరోగ్య సమస్యవస్తే ఆస్పత్రికి తీసుకెళ్తూ అమ్మానాన్నలా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. దగ్గరకు వెళ్లి చెబితే గానీ సరిగా వినిపించని వైకల్యం ఉన్నా దాన్ని ఏమాత్రం లెక్కచేయక చెల్లీతమ్ముడికి ఆప్యాయతానురాగాలు పంచుతోంది.



ఇంటి వద్ద వంట చేస్తున్న ప్రతిజ్ఞ

హైదరాబాద్‌లో తల్లిదండ్రులు

ప్రతిజ్ఞ తండ్రి సాగర్ పెయింటర్. అరకొర సంపాదన కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. ఈ నేపథ్యంలో ఐదేళ్ల క్రితం కుటుంబంతో సహా హైదరాబాద్‌కు మకాం మార్చాడు. అక్కడ ఒక కాంట్రాక్టరు వద్ద భార్యతో పాటు పెయింటింగ్ పనుల్లో కూలీగా చేరాడు. అక్కడే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. ఇలా సాఫీగా సాగుతున్న వారి సంసారాన్ని కరోనా రక్కసి కష్టాల్లోకి నెట్టింది. ఆ తర్వాత పనుల్లేక తల్లడిల్లిపోవాల్సి వచ్చింది. విధిలేని పరిస్థితుల్లో మళ్లీ స్వగ్రామానికి రావాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కాంట్రాక్టర్ వద్ద అప్పు తీరకపోవడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో పిల్లలు ముగ్గురినీ సొంత ఊరికి పంపి.. నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చి సరుకులు, కొంత నగదు ఇచ్చి వెళ్లిపోవాల్సిన పరిస్థితి. మరో రెండేళ్లపాటు బిడ్డలకు దూరంగా ఉంటూ కుమిలిపోవాల్సి వస్తోంది.



చిట్టి చేతులకు కొండంత అండ

ఏడాది క్రితం నుంచి స్వగ్రామంలో ఉన్న ఈ చిన్నారులకు పాఠశాలలో ఒకపూట మధ్యాహ్న భోజనం అందుతోంది. ఇదిగాక యూనిఫాం, పుస్తకాలు, అంగన్‌వాడీ ద్వారా గుడ్లు, ఇతర సామగ్రి వస్తుండడం కాస్త ఆదరువుగా నిలుస్తోంది. గ్రామ వలంటీర్ వీరిని గుర్తించి ఇప్పటికే ఆధార్ కార్డు ఇప్పించారు. రేషన్ కార్డుకు సైతం దరఖాస్తు చేయించారు. అది వచ్చిన తర్వాత వీరి సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి దరఖాస్తు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. వచ్చే ఏడాది పిల్లల్లో ఒకరికి అమ్మఒడి అందనుంది. ఇటీవల వచ్చిన తుపానుకు చిన్నారులు ఉన్న ప్రాంతం ముంపునకు గురికావడంతో ప్రభుత్వం తరఫున కూరగాయలు, వంట సామగ్రితోపాటు ఆర్థిక సాయం అందింది.

భయపెట్టిన తుపాను



తుపాను సాయం అందుకుంటున్న ప్రతిజ్ఞ

గత ఏడాది వచ్చిన మాండూస్ తుపానుతో ముడిపల్లె ఎస్టీ కాలనీ అతలాకుతలమైంది. ఇళ్లు మునిగిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రతిజ్ఞ ఉంటున్న ఇంటి పైకప్పు సైతం దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా తమ్ముడు, చెల్లిని రెక్కలకింద పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వచ్చింది. అప్పుడప్పుడూ ఇంటికి సమీపంలోనే ఉన్న మేనత్త వచ్చి సాయం అందించేది. తిండికూడా సరిగా వండుకునే పరిస్థితి లేకపోవడంతో అర్ధాకలితోనే అలమటించినట్టు ప్రతిజ్ఞ చెబుతోంది.

అమ్మలా చూసుకుంటోంది



అక్క ప్రతిజ్ఞ ఉదయాన్నే లేచి ఇంటిని శుభ్రం చేసి నన్ను నిద్ర లేపుతుంది. చదువుకోమని చెప్పి తాను స్నానం చేసి వంట సిద్ధం చేస్తుంది. నేను స్నానం చేసి వచ్చేలోపు అన్నం చేసి తినిపిస్తుంది. తనే దగ్గరుండి పాఠశాలకు తీసుకెళ్లి వదలిపెడుతుంది. మళ్లీ పాఠశాల వదిలే సమయంలో నన్ను ఇంటికి తీసుకువస్తుంది. రాత్రి పూట అన్నం తినిపిస్తుంది. జ్వరం వస్తే ఆస్పత్రికి తీసుకెళ్తుంది. అప్పుడప్పుడూ అమ్మ, నాన్న వస్తారు. అప్పటి వరకు అక్కే చూసుకుంటుంది.
–సుదీప్‌కుమార్

అక్కే స్నానం చేయిస్తోంది



నాకు అక్కే స్నానం చేయిస్తుంది. బట్టలు తొడుగుతుంది. అన్నం తినిపిస్తుంది. రాత్రిళ్లు నేను పక్క తడిపేస్తే ఆ దుస్తులను కూడా తనే ఉతుకుతుంది. రాత్రిళ్లు భయపడితే పక్కనే పడుకోనిచ్చి నిద్రపుచ్చుతుంది. అక్కే అమ్మలా అన్నీ చూస్తోంది. మాకు అమ్మనాన్న లేరనే దిగులు లేకుండా చూసుకుంటోంది.
– మధుర

అమ్మతో ఉంటూ అలా నేర్చుకున్నా..



రోజూ పెయింటింగ్ పనులకు వెళ్లి వచ్చి మణికట్టు, చేతుల నొప్పితో అమ్మ చాలా బాధపడేది. చేతులు ఒత్తుకుంటూ కన్నీరు పెట్టేది. ఆ బాధ చూసి ఆమెకు వంటచేసే సమయంలో, ఇతర పనుల్లో సాయంగా ఉండేదాన్ని. అలా వంటావార్పు నేర్చుకున్నా. ఇంటి పనులు ఎలా చేయాలో తెలుసుకున్నా. తమ్ముడు, చెల్లెల్ని నేనే చూసుకుంటా. ఏవైనా సమస్యలు వస్తే తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెబుతుంటా.
– ప్రతిజ్ఞ, ముడిపల్లె ఎస్టీ కాలనీ

నాలుగు నెలల్లో వచ్చేస్తాం

హైదరాబాద్‌లో నేను, నా భర్త పెయింటింగ్ కాంట్రాక్టు వర్కులు తీసుకొని చేస్తున్నాం. కరోనా సమయంలో తీసుకున్న కాంట్రాక్టులు చేయలేక పోయాం. ప్రస్తుతం ఆ పనులు పూర్తి చేస్తున్నాం. నాలుగు నెలల్లో కాంట్రాక్టు వద్ద పని అయిపోతుంది. ముడిపల్లెకు వచ్చేస్తాం. పొదుపు చేసిన డబ్బులు కొంత ఇంటి నిర్మాణానికి వాడుకుంటాం. నగరి పరిసర ప్రాంతాల్లో పెయింటింగ్ పనులకు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం.
– సెల్వి, ప్రతిజ్ఞ తల్లి

నిరాశాజనకంగా బడ్జెట్

- ప్రాజెక్టులకు మొండిచేయి
- కార్మికులకు అన్యాయం
- జిల్లాకు ఒరిగిందేమీ లేదన్న మేధావులు

తిరుపతి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని పలువురు మేధావులు వెల్లడించారు. పలు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాకు ఈ బడ్జెట్ వల్ల ఒరిగిందేమీ లేదని పెదవి విరుస్తున్నారు.

తిరోగమన బడ్జెట్



విభజన హామీల్లో భాగమైన ప్రత్యేక హోదా, రైల్వేజోన్, పోలవరం రాయలసీమ ప్రాజెక్టులకు నిధుల ప్రస్తావన లేకపోవడం అన్యాయం. విభజన చట్టంపై తొమ్మిదేళ్లు గడుస్తున్న స్పష్టత లేదు. మరో ఏడాది మాత్రమే చట్టానికి గడువు ఉంది. ఆదాయపన్ను మినహాయింపులోనూ ఉద్యోగులకు పెద్ద ప్రయోజనం చేకూర్చలేదు.
– పురుషోత్తమరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త

శ్రమజీవులకు వ్యతిరేకం



మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ శ్రమ జీవులకు వ్యతిరేకంగా ఉంది. నిరుద్యోగ నిర్మూలన, ధరల నియంత్రణ, ఆర్థి వ్యవస్థ పురోగతికి ఏమాత్రం సాయపడదు. కేవలం ప్రైవేటు పెట్టుబడులకు మాత్రమే అనుకూలంగా ఉంది. ఐసీడీఎస్, మధ్యాహ్నభోజన పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, విద్యామిషన్, జీవనోపాధుల మిషన్‌కు కేటాయింపులు పెంచలేదు.
– కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కేటాయింపులు లేవు



బడ్జెట్‌లో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు జనాభా ప్రాతిపదికన కేటాయింపులు లేవు. ఎయిర్ పోర్టులు, ఓడరేవులు, హెలీప్యాడ్‌ల అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యత, దళిత బహుజనులకు ఇవ్వలేదని స్పష్టంగా తెలుస్తోంది. రాయలసీమ ప్రస్తావన లేకపోవడం అన్యాయం. – పి.అంజయ్య ,ఆర్పీఐ, దక్షిణ భారత అధ్యక్షుడు

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, పక్కన ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకే ప్రాధాన్యమివ్వనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని త్రినేత్ర అతిథిగృహంలో ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శివరాత్రి, రథోత్సవం, కల్యాణోత్సవం, గిరిప్రదక్షిణకు పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలని, పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, పార్కింగ్, వాహనాల మళ్లింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భక్తుల సౌకర్యం కోసం ప్రతి చోటా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే అన్నదాన శిబిరాలు నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ఐసీడీఎస్, పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన నిఘా పెట్టాలన్నారు. అవసరాలకు తగ్గట్టు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, 108 వాహనాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఎస్పీ పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులను సైతం గుర్తింపు పాస్‌లు ఉంటేనే ఆలయంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయాల్లో ప్రొటోకాల్ దర్శనాలు ఉంటాయన్నారు. రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతే పరమావధిగా పనిచేయాలని సూచించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాగర్‌బాబు, ఆర్డీఓ కనకనరసారెడ్డి, పాలకమండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకేష్‌ది ఒంటరి గళం

- తండ్రి సీఎంగా ఉండీ.. కొడుకు ఓడిపోవడం దేశంలోనే రికార్డు
- పర్యాటక శాఖమంత్రి ఆర్ కే రోజా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

చిత్తూరు రూరల్: లోకేష్‌ది యువగళం కాదు.. ఒంటరిగళం.. ఆయనచుట్టూ ఉన్న గన్‌మెన్లు, రోప్ పార్టీ తీయిస్తే.. మిగిలింది పది మంది మాత్రమేనని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ఆర్‌కే రోజా అన్నారు. చిత్తూరులో బుధవారం మంత్రి మీడియాతో ఏమన్నారంటే.. ‘యువగళంలో లోకేష్ ఒంటరివాడయ్యారు. పోలీసుల బందోబస్తు తీయిస్తే యాత్రలో పదిమంది కూడా ఉండరు. పప్పు లీడర్‌గా వంద శాతం ఫెయిల్యూర్. ఇది మంగళగిరి వారికి ఎప్పుడో తెలుసు.. అందుకే లోకేష్‌ను ఓడించి పంపించారు. ఎక్కడైనా సీఎంగా ఉన్న వ్యక్తి కొడుకు ఓడిపోవడం చూశారా. ఆ ఒక్క రికార్డు పప్పుకే దక్కింది. ఎక్కడ అడుగుపెడితే అక్కడ ఐరన్‌లెగ్ టాక్. పాదయాత్రలో ఒక్కోరోజు ఒక్కో సంఘటన ఎదురవుతోంది. ప్రజలు కూడా భయపడుతున్నారు. మూన్నాళ్ల ముచ్చటైన ఈ యాత్రను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసమే ముఖ్యమంత్రి అయ్యారు. సీఎం, ప్రజల ఆశ్వీరాదంతో మేమంతా ఎమ్మెల్యేలు.. మంత్రులయ్యాం. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పప్పు లాంటి వ్యక్తులకు బుద్ధి చెప్పే కార్యక్రమం. చంద్రబాబు రాష్ట్రాన్ని దోచుకుని హైదరాబాద్‌లో దాచుకున్నది చాలక.. మళ్లీ దోచుకోవడానికి ఒక్క అవకాశం కావాలంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 3600 కిమీ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకుని భరోసా కల్పించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాటను 98 శాతం పూర్తిచేశారు’’ అని మంత్రి స్పష్టంచేశారు.

సకల వసతులతో టౌన్‌షిప్‌లు

- తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి తుడా : తుడా పరిధిలో మోడరన్ టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేయనున్నట్లు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఇతర అధికారులతో సమీక్షించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ టౌన్‌షిప్‌ల ద్వారా మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండే తక్కువ ధరకే ఇంటి స్థలం అందిచవచ్చన్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను అప్పగిస్తే నిర్దేశిత ధరకే తుడా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. టౌన్‌షిప్‌లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

అభివృద్ధి చేసిన లేఅవుట్ల ద్వారా వచ్చిన లాభాలను ఆయా గ్రామాల్లో వసతుల కల్పనకే వినియోగిస్తున్నట్లు తెలిపారు. పుత్తూరు, నగరిలో పార్కులు, శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి కరకట్టను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. పలు చోట్ల కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. తుమ్మలగుంట వద్ద స్టేడియం నిర్మించామని,, వాకింగ్,సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేసి త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుడాకు భూ బ్యాంక్ సమకూర్చేందుకు సహకరిస్తామన్నారు. టౌన్‌షిప్‌ల అభివృద్ధికి ఈ నెల 15వ తేదీ లోపు అందుబాటులో ఉన్న భూముల వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో తుడా వీసీ హరికృష్ణ, సెక్రటరీ లక్ష్మి, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, ఆర్‌డీఓలు కనకనరసా రెడ్డి, రామారావు, కిరణ్ కుమార్, చంద్రముని పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఘనంగా భీష్మ ఏకాదశి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో భీష్మ ఏకాదశి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లు, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చప్పరాలపై ,అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. విజ్ఞానగిరి వద్ద ఆదిదంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈనెల 5వ తేదీన ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షను నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో 13పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు స్కూల్ లాగిన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే వారి కేంద్రాలకు చేరుకోవాలని, పూర్తి వివరాలకు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లోను, అలాగే డీఈఓ కార్యాలయంలోనూ సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ఎస్‌డీహెచ్‌ఆర్‌కు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించినట్టు చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాక్ సభ్యులు ఇటీవల తమ కళాశాలను సందర్శించి మౌలిక వసతులు, విద్యా బోధన, తరగతి గదులు తదితరాలను పరిశీలించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు ఎక్కువ మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించడం, బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు ఇచ్చినట్టు వివరించారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ సత్తా



ఉత్తీర్ణులైన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఫలితాల్లో తిరుపతి ఎమరాల్డ్స్‌కి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులైనట్లు సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మొత్తం 400 మార్కులకు గాను కె.మునివర్షిత-342, డి.రేవంత్-338, కె.సృజనాథాగూర్- 338, కె.బింధుశ్రీ-330, పి.ముస్కాన్-328, జి.శిరీష- 326 మార్కులు సాధించినట్లు వివరించారు.

జాతీయ స్థాయి త్రోబాల్‌కు ముగ్గురు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సదుం: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చెరుకువారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ చిన్నప్ప బుధవారం తెలిపారు. నంద్యాల జిల్లాలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన అంతర్ జిల్లా అండర్ 14 బాల, బాలికల త్రోబాల్ పోటీల్లో విద్యార్థులు చైతన్య, భానుప్రసాద్, మునిశ్రీజ ప్రతిభ చూపారని ఆయన చెప్పారు. దీంతో త్వరలో జరిగే నేషనల్స్‌లో రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. విద్యార్థులను పాఠశాల బృందం అభినందించింది.

హోరాహోరీగా సాక్షి ప్రీమియర్ లీగ్

- రెండో రోజు కొనసాగిన జోరు
- 26 బంతుల్లో 53 పరుగులు చేసిన చైతన్య



తుమ్మలగుంట క్రీడా మైదానంలో సాగుతున్న ఎస్పీఎల్ క్రికెట్ మ్యాచ్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట వద్ద నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం క్రికెటర్లు అదే జోరును కొనసాగించారు. రెండు మైదానాల్లో నిర్వహించిన 6మ్యాచ్‌ల్లో 12జట్లు తలపడ్డాయి. బ్యాట్స్‌మెన్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ సిక్స్‌లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. చూడ చక్కని షాట్లతో మంచి ఇన్నింగ్స్ నిర్మిస్తూ భారీ స్కోరును ప్రత్యర్థి జట్టు ముందుంచారు. వీరికి తోడుగా బౌలర్లు పదునైన బంతులతో క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ పరుగులు కట్టడి చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు.

గ్రౌండ్ 1లో..

- మొదటి మ్యాచ్‌లో వీఆర్ఎస్ ఎంబీఏ కళాశాల జట్టుపై ఎస్వీసీఈ-1 జట్టు 6వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన వీఆర్ఎస్ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 80పరుగులు చేసింది. తరువాత ఎస్వీసీఈ-1 జట్టు 8 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 81పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఎస్వీసీఈ-1 జట్టు బ్యాట్స్‌మన్ తరుణ్‌రాజ్ 21 బంతుల్లో 6ఫోర్లు, 1సిక్సర్‌తో 42 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్‌లో శ్రీరామ ఇంజినీరింగ్ జట్టుపై చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 28 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన చదలవాడ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 108 పరుగులు చేయగా, శ్రీరామ జట్టు 10ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసి ఓటమిని మూటగట్టుకుంది.
- మూడో మ్యాచ్‌లో ఎస్వీసెట్ జట్టుపై శ్రీవిద్యానికేతన్ జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విద్యానికేతన్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాట్స్‌మన్ చైతన్య మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 26 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 53 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్వీసెట్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేసింది.

గ్రౌండ్ 2లో..

- మొదటి మ్యాచ్‌లో శ్రీరామ జట్టుపై ఎస్వీఈసీ-2 జట్టు 31 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీఈసీ-2 జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేయగా, శ్రీరామ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 75 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.
- రెండో మ్యాచ్‌లో ఎస్వీసీఈ జట్టుపై శ్రీవిద్యానికేతన్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ జట్టు 7 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీవిద్యానికేతన్ జట్టు 7 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి అలవోకగా గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో విద్యానికేతన్ జట్టు బ్యాట్స్‌మన్ శివాజీ 21 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 పరుగులు చేశాడు.
- మూడో మ్యాచ్‌లో పలమనేరు మదర్ థెరిస్సా కళాశాల జట్టుపై పుత్తూరు సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిద్దార్థ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేయగా, మదర్ థెరిస్సా జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 53 పరుగులు మాత్రమే చేసింది.

SPL SAKSHI PREMIER LEAGUE

గెలుపొందిన జట్లు

గ్రౌండ్-1
ఎస్వీసీఈ-1
చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల
శ్రీవిద్యానికేతన్

గ్రౌండ్-2
ఎస్వీఈసీ-2
శ్రీవిద్యానికేతన్
పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల



గెలుపొందిన ఎస్వీసీఈ-1 జట్టు



సత్తా చాటిన విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు



విజయం సాధించిన ఎస్వీఈసీ-2 జట్టు



ప్రతిభ చూపిన చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల జట్టు



గెలుపొందిన విద్యానికేతన్ కళాశాల జట్టు



గెలిచిన పుత్తూరు సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న సీఐ అబ్బన్న

– 14 ద్విచక్ర వాహనాల స్వాధీనం

తిరుపతి క్రైమ్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ద్విచక్ర వాహనాలను అపహరించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అలిపిరి సీఐ అబ్బన్న తెలిపారు. బుధవారం మంగళం ఔట్ పోస్ట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుత్తూరుకు చెందిన లేట్ వాహీద్ కుమారుడు షేక్ మస్తాన్ (21) కొంతకాలంగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్టు సమాచారం అందిందన్నారు. ఈ క్రమంలో మస్తాన్‌ను కరకంబాడి వద్ద అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. విచారణలో నిందితుడు తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి, చిత్తూరు టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్టు గుర్తించామని వెల్లడించారు. ఈ మేరకు మస్తాన్ వద్ద సుమారు రూ.20లక్షల విలువైన 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై ఇప్పటి వరకు 18 కేసులు నమోదైనట్టు పేర్కొన్నారు. నిందితుడి అరెస్ట్‌కు ఎస్ఐ రెడ్డెప్ప, సిబ్బంది కృషి చేసినట్లు తెలిపారు.

ఉంగరం చోరీ.. నిందితుడి అరెస్ట్

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో నివసిస్తున్న సంధ్య అనే మహిళ ఉంగరాన్ని బుధవారం బలవంతంగా లాక్కెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. సంధ్య ఇంట్లో ఉండగా గుర్తుతెలయని వ్యక్తి లోపలికి చొరబడ్డాడు. మహిళ నోట్లో గుడ్డలు కుక్కి ఆమె ఉంగరాన్ని లాక్కుని ఉడాయించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే గాలింపు చేపట్టి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పడమటి వీధిలో గాంధీ పార్కు సమీపంలో నివసిస్తున్న ఆర్కాట్ కాంతారావు(59) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మృతుడి భార్య ఆర్కాట్ సుజాత ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. కాంతారావు కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రించాడు. ఉదయం చూసేసరికి ఇంటి ముందు మెట్ల వద్ద ఉరేసుకుని ఉన్నాడు. కుటుంబీకుల కేకలతో చుట్టుపక్కలవారు చేరుకుని కాంతారావును ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే కాంతారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ వేణు తెలిపారు.

రేడియేటర్ పేలి ఇద్దరికి గాయాలు

కుప్పంరూరల్: ఆర్టీసీ బస్సులో రేడియేటర్ పేలి కూలెంట్ ఆయిల్ బయటికి రావడంతో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుప్పం - తిరుపత్తూరు మధ్య తిరుగుతున్న ఆర్టీసీ బస్సు బుధవారం తిరుపత్తూరు వెళ్లి కుప్పంకు బయల్దేరింది. మార్గ మధ్యం మల్లానూరు వద్దకు చేరుకోగానే రేడియేటర్ నుంచి ఉన్నట్టు ఉండి కూలెంట్ ఆయిల్ బయటికి వచ్చింది. ఈ ఆయిల్ చిమ్ముకుని డ్రైవర్ సంపంగి, పక్కనే ఉన్న ప్రయాణికురాలు గొల్లపల్లికి చెందిన ధనలక్ష్మిపై పడింది. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన వారిద్దరినీ కుప్పం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

'భద్రత'.. బాధ్యత

- ప్రమాదాల నివారణపై వరుసగా అవగాహన సదస్సులు
- నేటితో ముగియనున్న రహదారి భద్రతా వారోత్సవాలు



మాట్లాడుతున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

తిరుపతి అర్బన్ : రోడ్డు భద్రతా వారోత్సవాలను ఆర్టీసీ అధికారుల పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గత నెల 27వ తేదీ నుంచి ప్రతి రోజూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నారు. గురువారంతో ముగియనున్న వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని డిపోల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నారు.

రోజుకో అంశంపై సదస్సు

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)బ్రహ్మానందరెడ్డి తిరుపతి డిపోలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రెండో రోజు తరచూ యాక్సిడెంట్లు చేస్తున్న 60 మంది డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై డీపీటీఓ చెంగల్‌రెడ్డి అవగాహన కల్పించారు. మూడో రోజు సదస్సులో డ్రైవర్ల వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి పలు సూచనలు చేశారు. నాలుగో రోజు కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. ప్రమాదాల నివారణలో కండక్టర్ల పాత్రను తెలియజేశారు. ఐదో రోజు మెకానిక్స్‌తో సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా వాహనాలను కండిషన్‌లో ఉంచడంపై అవగాహన కల్పించారు. ఆరో రోజు తిరుపతి గ్యారేజ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 32 మంది రక్తదానం చేశారు. గురువారం చివరి రోజున జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల్లో రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సదస్సులు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

జాగ్రత్తలపై అవగాహన కల్పించాం



ఆర్టీసీలో అన్ని విభాగాల వారికి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. రోడ్డు భద్రతా వారోత్సవాల సమయంలోనే కాకుండా నిత్యం నిబంధనలు పాటించాలని సూచించాం. ప్రధానంగా డ్రైవర్ల వ్యక్తగత సమస్యలు తెలుసుకున్నాం. వాటి నివారణకు చర్యలు తీసుకుంటాం. మెకానిక్స్‌కు వారి పాత్రను వివరించాం.కండక్టర్లుకు సైతం అవగాహన కల్పించాం. రోడ్డు ప్రమాదాలకు చెక్ పెడతాం.

–తిమ్మాడి చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి

ఒక్కరోజులోనే 10 లక్షల డౌన్‌లోడ్లు



మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి అలిపిరి: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇటీవల ప్రారంభించిన టీటీడీదేవస్థానమ్స్ మొబైల్ యాప్‌ను ఒక్కరోజులోనే 10 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నట్లు జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. బుధవారం టీటీడీ సమాచార కేంద్రాలు, అనుబంధ ఆలయాల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. జేఈఓ మొబైల్ యాప్‌పై ముమ్మరంగా ప్రచారం చేయాలని సూచించారు. టీటీడీ సమాచారం, సేవలు, దర్శన టికెట్లు, గదుల బుకింగ్‌ను యాప్ ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒంటిమిట్ట కోదండరామాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ జనరల్ గుణభూషణ్ రెడ్డి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, డిప్యూటీ ఈఓలు లోకనాథం, విజయకుమార్ పాల్గొన్నారు.

పెత్తందార్ల కోసం చంద్రబాబు ఆరాటం



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం పథకాలు అందిస్తుంటే, చంద్రబాబు కోటీశ్వరులు, పెత్తందార్ల కోసం ఆరాట పడుతున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి ఆరోపించారు. ఆయన బుధవారం మండలంలోని మారేపల్లెలో మీడియాతో మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు అమలు చేయని పథకాలను సీఎం జగన్ చేస్తున్నట్లు తెలిపారు. పేదవాడు ఎప్పటికీ పేదవాడుగానే మిగిలిపోవాలన్న దుర్బుద్ధితో చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 2024లో పెత్తందార్లకు పేదవారికి మధ్య పోరాటం జరుగుతుందని వ్యాఖ్యానించారు. సీఎం జగన్‌కు ద్రోహం చేసిన వారు రాజకీయ సన్యాసం తీసుకున్నారని గుర్తు చేశారు. పందులు అంతా కలిసి గుంపుగా వచ్చినా జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేదని స్పష్టం చేశారు. పేద ప్రజలందరూ జగన్‌ను దేవుడిలా చూస్తూ ఆయనకు మద్దతు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ప్రజా బలం ఉన్న నేతను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, మండల అధ్యక్షుడు ధనంజయరెడ్డి, ఎంపీటీసీలు మురళీరెడ్డి, భాస్కర్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సర్పంచ్‌లు అన్నూరాశి, గోవిందయ్య, నాయకులు గురవారెడ్డి, భీమశంకర్‌రెడ్డి, రాణెమ్మ, రవి పాల్గొన్నారు.